క్లుప్తంగా

అచ్చవెల్లి గంగమ్మకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో అచ్చవెల్లి గంగమ్మ

పులివెందుల రూరల్ : మండల పరిధిలోని అచ్చవెల్లి గ్రామంలో వెలసిన అచ్చవెల్లి గంగమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోరిన కోరికలు తీర్చే గంగమ్మతల్లిగా అచ్చవెల్లి గంగమ్మ ఎంతో ప్రసిద్ధి గాంచింది. కర్నూలు, అనంతపురం జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు.

వన భోజనాలు

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొత్తపేట గంగమ్మ ఆలయం వద్ద ఏపీ టూరిజం హాలులో ఆదివారం బలిజ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సగినాల శ్రీనివాసులు, కార్యదర్శి రెడ్డయ్య ఆధ్వర్యంలో కార్తిక వనభోజనాల కార్యక్రమాన్ని సీవీఎస్ మూర్తి ప్రారంభించారు. కార్యక్రమానికి హాజరైన పెద్దలు మాట్లాడుతూ బలిజ సంఘం అభివృద్ధికి అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బలిజ సంఘం నాయకులు పాల్గొన్నారు.

పులివెందుల టౌన్ : మండలంలోని గుండాలయ్య కోనలో ఆదివారం నియోజకవర్గంలోని యాదవులు కార్తిక వనభోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఏడాది కార్తికమాసం చివరి ఆదివారం వనభోన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అధ్యాత్మికతను పెంపొందించుకోవాలి


సేవలో పాల్గొన్న సాయి సేవకులు

వేంపల్లె : ప్రతి ఒక్కరు అధ్యాత్మికతను పెంపొందించుకోవాలని సాయిసేవక్ శివపార్వతి తెలిపారు. ఆదివారం కార్తిక మాసం సందర్భంగా కడప రోడ్డులోని షిర్డిసాయి ఆలయంలో ప్రత్యేక భక్తి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సాయి చరిత్ర, పారాయణం, పల్లకిసేవ, సాయిభజన, దీపారాధన, వంటి ఆధ్యాత్మికత కార్యక్రమాలను ఘనంగ నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీచైతన్య పాఠశాల కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్లు చైతన్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాయలసీమలోని సంస్థలను తరలించవద్దు

కడప వైఎస్ఆర్ సర్కిల్: రాయలసీమలో నెలకొల్పిన సంస్థలను అమరావతి తరలించవద్దని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.రవిశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని ఆర్‌సీపీ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాయలసీమలోని ఎంఎస్ఎంఈ, ఏపీజీబీ ప్రధాన కార్యాలయాన్ని తరలించడాన్ని వ్యతిరేకిస్తూ రాయలసీమ వ్యాప్తంగా సోమవారం అన్ని మండల కేంద్రాల్లో తహసీల్దారులకు వినతి పత్రాలు ఇవ్వనున్నామన్నారు. రాయలసీమ వ్యాప్తంగా అవగాహన సమావేశాలు నిర్వహిస్తామని, అందరినీ కలుపుకొని కలెక్టరేట్ వద్ద ప్రత్యక్ష ఆందోళన చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీయూ రాష్ట్ర కార్యదర్శి సిద్ధిరామయ్య, ఆర్‌సీపీ నగర కార్యదర్శి మక్బూల్ బాషా, నగర కార్యదర్శి వర్గ సభ్యులు మడగలం ప్రసాద్, చాపల సుబ్బరాయుడు, లక్ష్మీదేవి, విజయ్, రమేష్, మునిరెడ్డి పాల్గొన్నారు.

చోరీల భయం

కడప కార్పొరేషన్: కడప నగరం 14వ డివిజన్ పరిధిలోని ప్రకాష్ నగర్‌లో ఇటీవల జరిగిన చోరీలు ప్రజలను భయపెడుతున్నాయి. ఎప్పుడు ఏమి జరుగుతుందోనని స్థానికులు ఆందోళన పడుతున్నారు. రెండు నెలల కిందట బీసీ హాస్టల్ సమీపంలో ఓ ఉపాధ్యాయుడి ఇంట్లో చోరీ జరిగింది. ఏడు తులాల బంగారు, డబ్బు దుండగులు దోచుకెళ్లినట్లు తెలుస్తోంది. రెండు రోజుల కిందట చంద్రమౌళీ నగర్‌లోని ఓ వితంతువు ఇంట్లో దొంగలు చొరబడ్డారు. నోట్లో గుడ్డలు కుక్కి, కత్తితో బెదిరించి బంగారు గాజులు, మెడలో చైన్ దోచుకెళ్లినట్లు సమాచారం. ఈ దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు కావడంతో దొంగ పట్టుబడినట్లు తెలుస్తోంది. ఇలా ఎక్కడో ఒకచోట చోరీ జరుగుతుండడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ఈ ప్రాంతంలో పోలీసులు గస్తీ మరింత పెంచాలని, రాత్రిళ్లు పెట్రోలింగ్ చేయాలని పలువురు కోరుతున్నారు.

మారెమ్మకు పూజలు

కడప కోటిరెడ్డిసర్కిల్: కడప నగరంలోని ఎర్రముక్కపల్లె మారెమ్మ తల్లిని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త నుండూరి శ్రీనివాస్ దంపతులు ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు పూలమాల, శాలువాతో ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సట్టి భారవి, సట్టి మాధవి, సట్టి భాస్కర, నీరజ, వనజ, శ్రీనివాసులు, సుశీలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సేద్యం.. వైవిధ్యం

శనగ పంటను సాగుచేసిన రైతులు శనగ పంటలో కలుపు మొక్కలు తీయడానికి కూలీలు దొరకకపోవటంతో రైతులు వివిధ మార్గాల ద్వారా కలుపు మొక్కలు తీయించే పనిలో పడ్డారు. ట్రాక్టర్‌కు మూడు గుంటికలు, కాడెద్దులకు రెండు గుంటికలు కట్టి సేద్యం చేస్తున్నారు. కొందరైతే కుటుంబ సభ్యులే కాడెద్దులుగా మారి పొలంలో కలుపు మొక్కలను తొలగిస్తున్నారు. – పెద్దముడియం


ఎద్దులతో సేద్యం చేస్తున్న రైతు


ట్రాక్టర్ మూడు గుంటికలుతో సేద్యం చేస్తున్న రైతులు


తండ్రితో కలిసి గుంటికతో సేద్యం చేస్తున్న కుమారుడు

విజనరి సీఎం అంటే విద్యుత్ చార్జీలు పెంచడమా?

వల్లూరు (చెన్నూరు) : విజనరీ సీఎం అంటే విద్యుత్ చార్జీలు పెంచడమా? అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జేసీఎస్ కన్వీనర్ ఎర్రసాని నిరంజన్‌రెడ్డి ప్రశ్నించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యుత్ చార్జీల విషయంలో చంద్రబాబు ప్రభుత్వం మాట తప్పిందన్నారు. అధికారంలోకి రాక ముందు విద్యుత్ చార్జీలు పెంచం, తగ్గిస్తామని వాగ్దానం చేశారన్నారు. ఏరు దాటినంత వరకు ఓడ మల్లన్న, దాటాక బోడి మల్లన్న అన్నట్లుందని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చేది గోరంత అయితే లాక్కునేది కొండంత అన్నారు. ఉచిత గ్యాస్ సిలిండర్ల పేరుతో ప్రభుత్వం ఏడాదికి ప్రజలకు ఇచ్చేది రూ.2,684 కోట్లు.. విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో లాక్కునేది రూ.15,485 కోట్లని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచన చేయాలని, సర్దుబాటు చార్జీలను ఉపసంహరించు కోవాలని ఆయన సూచించారు.

నేడు అయ్యప్పస్వామి మండల పూజ


మండలపూజకు ముస్తాబవుతున్న మండపం

పులివెందుల టౌన్ : పట్టణంలోని శ్రీమిట్టమల్లేశ్వర స్వామి దేవస్థానంలో సోమవారం అయ్యప్పస్వామి మండల పూజ నిర్వహించనున్నట్లు అయ్యప్పస్వామి భక్త మండలి వారు తెలిపారు. ఉదయం స్వామివారికి యాగశాల ప్రవేశం, గణపతిపూజ, స్వస్తి వాచకం, పంచామృతాభిషకం, హోమాలు, అయ్యప్పస్వామి అంబులం, పడిపూజ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మధ్యాహ్నం అయ్యప్ప భక్తులకు బిక్ష (అన్నదాన) కార్యక్రమం ఉంటుందన్నారు. సాయంత్రం కేరళ వాయిద్యాల మధ్య అయ్యప్పస్వామి గ్రామోత్సవం నిర్వహించనున్నారు. నియోజకవర్గంలోని అయ్యప్ప భక్తులందరూ పాల్గొనాలని వారు కోరారు.

కరపత్రాల ఆవిష్కరణ

సింహాద్రిపురం : స్థానిక వేణుగోపాలస్వామి దేవస్థానంలో విశ్వహిందూ పరిషత్ ఆంధ్రప్రదేశ్ హైందవ శంఖారావం బహిరంగ సభ సందర్భంగా ఆదివారం కరపత్రాలను సభ్యులు ఆవిష్కరించారు. ఇందులో భాగంగా హిందూ నగర మాసపత్రికను విడుదల చేసి మాట్లాడారు. జనవరి 5వ తేదీన విజయవాడలో జరిగే హైందవ శంఖారావం బహిరంగ సభకు ప్రతి ఒక్కరు జయప్రదం చేయాలని కోరారు.

ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

కమలాపురం : ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని కమలాపురం సీహెచ్‌సీ వైద్యాధికారి పవన్‌కుమార్ తెలిపారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం స్థానిక సీహెచ్‌సీ నుంచి రైల్వే గేటు వరకు విద్యార్థులు, వైద్య, ఆరోగ్య సిబ్బందితో కలసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని, ఈ సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలన్నారు. హెచ్‌ఐవీ బారిన పడ్డ వారిపై వివక్ష చూపరాదని, వారు నిరాదరణకు గురికాకుండా సమాజంలో గౌరవంగా జీవించేటట్లు చూడాలన్నారు. తద్వారా హెచ్‌ఐవీ నివారణ దిశగా అడుగులు వేయాలన్నారు. స్త్రీ, పురుషుల అసురక్షిత లైంగిక పద్ధతిలోనే ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుందన్నారు. ఇది అంటు వ్యాధి కాదని, అంటించుకునే వ్యాధి అన్నారు. సురక్షిత లైంగిక సంబంధాలు, లైంగిక చర్యల్లో కండోమ్ వాడటం, చికిత్సల సమయంలో కొత్త సూదులు, సిరంజీలు వాడాలన్నారు. రక్త మార్పిడి సమయంలో గుర్తింపు పొందిన రక్తనిధి కేంద్రాల నుంచి మాత్రమే రక్తాన్ని పొందడం వలన ఎయిడ్స్ వ్యాధి బారిన పడకుండా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు ధనలక్ష్మీ, అరుణ, షబానా, ఐసీటీసీ వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

పులివెందులలో..

పులివెందుల రూరల్ : ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా స్నేహిత అమృత సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక ఆసుపత్రి నుంచి నిర్వహించిన ర్యాలీని ఆసుపత్రి సూపరింటెండెంట్ విఘ్నేష్ ప్రారంభించి మాట్లాడారు. ఎయిడ్స్‌కు మందులు లేవని నివారణే మార్గమన్నారు. ర్యాలీలో సీడీఎస్ డైరెక్టర్ ఎసురత్నం, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, ఎన్‌సీసీ విద్యార్థులు, ఆరోగ్య కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

వేంపల్లెలో..

వేంపల్లె : ఎయిడ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ శేఖర్ తెలిపారు. ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఆసుపత్రి నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించి ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరు ఎయిడ్స్ బారిన పడకుండా ఎయిడ్స్ వ్యాధి నియంత్రణకు కృషి చేయాలన్నారు. ఎయిడ్స్ వ్యాధి గ్రస్తులపై వివక్ష చూపకూడదన్నారు. కార్యక్రమంలో వైద్యులు స్వాతిసాయి, రామ్మోహన్‌రావు, సుబ్బయ్య, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో అదివారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా వైద్య బృందం ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ పట్టణంలోని ఆసుపత్రి నుంచి రాణీవనం, ప్రకాశ్‌నగర్, రైల్వేస్టేషన్ కూడలి వరకు నిర్వహించారు. ఎయిడ్స్ నివారణపై అవగాహన కల్పిస్తూ ర్యాలీని వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, కమ్యూనిటీ డెవలప్మెంట్ సొసైటీ సభ్యులు పాల్గొని నిర్వహించారు. ఈ ర్యాలీకి వైద్యాధికారులు గైర్హాజరయ్యారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సూపర్‌వైజర్ ఓబులేసు పాల్గొన్నారు.

లింగాలలో..

లింగాల : ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం డీపీఎంఓ రమణారెడ్డి ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై హాస్టల్ విద్యార్థులకు అవగాహణ సదస్సు నిర్వహించారు. అనంతరం పీహెచ్‌సీ నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి ఎయిడ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి అంటు వ్యాధి కాదని అంటించుకునే వ్యాధి అన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ శివరాం, హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.


కమలాపురంలో ర్యాలీలో పాల్గొన్న వైద్య సిబ్బంది, విద్యార్థులు


పులివెందులలో ర్యాలీని ప్రారంభిస్తున్న ఆసుపత్రి సూపరింటెండెంట్


ఎర్రగుంట్లలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య బృందం


లింగాలలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు


వేంపల్లెలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, ఆరోగ్య కార్యకర్తలు

గుర్తుతెలియని వ్యక్తి మృతి

పులివెందుల రూరల్ : పట్టణంలోని పాత కడప బస్టాండ్ సమీపంలో ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. అంబకపల్లె రోడ్డు ప్రాంతాల్లో సంచరిస్తున్న సుమారు 55 ఏళ్ల వృద్ధుడు మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించారు.



అద్దె భవనంలో.. నిత్యం కష్టాలే


అద్దె భవనంలో గ్రంథాలయం

ఎర్రగుంట్ల : పట్టణంలోని ప్రభుత్వ గ్రంథాలయం అద్దె భవనంలో నడుస్తోంది. గతంలో ఈ గ్రంథాలయం ఉండే స్థలంలో ఇపుడు భవన సముదాయం నిర్మించారు. అప్పట్లో ఆ సముదాయంలోని గదులు కేటాయిస్తామని అధికారులు, ప్రజాప్రతినిధులు హామీ ఇచ్చారు. కానీ ఇప్పటి వరకూ గదుల కేటాయింపు జరగలేదు. దీంతో సొంత భవనం లేక రైల్వే లైన్ వద్ద ప్రభుత్వం పాఠశాల, అనంతరం పాత అన్న క్యాంటీన్ భవనంలోకి మార్చాల్సి వచ్చింది. ఇటీవల అన్న క్యాంటీన్ తెరవడంతో తిరిగి అద్దె గదిలోకి గ్రంథాలయం మార్చేశారు. మూడు సార్లు మార్చడంతో గ్రంథాలయం ఎక్కడ ఉందో తెలియని పరిస్థితి. గ్రంథాలయ కార్యదర్శి అమీరుద్దీన్ వివరణ కోరగా యర్రగుంట్ల గ్రంథాలయానికి సొంత స్థలం లేదని, అందుకే అద్దె భవనంలో ఉందని తెలిపారు. స్థలం కేటాయిస్తే భవనం నిర్మించుకుంటామని పాఠకులు చెబుతున్నారు.

పుస్తకావిష్కరణ


భావన మంజీరాలు పుస్తకావిష్కరణలో వక్తలు

జమ్మలమడుగు : పట్టణంలోని సాయిపరమేశ్వర డిగ్రీకాలేజిలో భావనా మంజీరాలు అనే పుస్తక పరిచయ కార్యక్రమం ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భాషోపాధ్యాయుల సంఘం నాయకుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ నేడు సమాజంలో తెలుగుభాష నేర్చుకోవాలన్న ఆసక్తి విద్యార్థుల్లో తగ్గిపోతుందన్నారు. ఉపాధ్యాయులు పిల్లలకు తెలుగుభాష యొక్క గొప్పతనాన్ని తెలియజేయాలన్నారు. మన కవుల గొప్పతనాన్ని వివరించాలన్నారు. తెలుగుభాష పట్ల మమకారంతో అద్భుతమైన పుస్తకాన్ని రచించిన రచయిత సురేష్ భావనా మంజీరాలు పుస్తకంలో పద్యాలు, సమస్యాపురణాలు, దత్తపదులు, నిషిద్ధాక్షరి ప్రక్రియలతో రచించడం ఎంతో గొప్ప విషయం అన్నారు.అనంతరం పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రిటైర్డు ఎంఈఓ మస్తాన్ రెడ్డి, జూనియర్ కాలేజి ప్రిన్సిపాల్ బండారు శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

గండికోటలో టోల్ వసూలు చేయడం దారుణం

కడప వైఎస్ఆర్ సర్కిల్: గండికోటకు వచ్చే పర్యాటకులతో టోల్ ఫీజు వసూలు చేయడం దారుణమని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ తెలిపారు. నగరంలోని సీపీఎం కార్యాలయంలో విలే కరులతో ఆదివారం ఆయన మాట్లాడుతూ కేంద్ర పురావస్తు శాఖ ఆధీనంలో ఉన్న పర్యాటక ప్రాంతానికి టోల్ వసూలు చేయడం విడ్డూరంగా వుందన్నారు. గండికోట అభివృద్ధికి రూ.70 కోట్లు విడుదల చేశామని మంత్రి చెబుతుంటే.. పర్యాటకుల వద్ద నుండి డబ్బు వసూలు చేస్తూ మాన్యువల్ టికెట్లు ఇవ్వడం తగదన్నారు. పార్కింగ్ చేసిన వాహనాలకు భద్రత లేని పరిస్థితి ఉందన్నారు. పర్యాటకుల జేబులకు చిల్లు వేసే ఈ పద్ధతికి స్వస్తి చెప్పాలన్నారు. సమావేశంలో నరసింహులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవమైంది

కడప ఎడ్యుకేషన్: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవమైందని కడప డీఈఓ మీనాక్షి అన్నారు. చెన్నూరు బాలుర ఉర్దూ హైస్కూల్‌లో పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయురాలు మహబూబ్ చాంద్ సన్మాన సభ ఆదివారం కడప ఉమేష్‌చంద్ర కళ్యాణ మండపంలో నిర్వహించారు. డీఈఓ మీనాక్షి మాట్లాడుతూ నేటి ఉపాధ్యాయ లోకానికి మహబూబ్ చాంద్ సేవలు ఎంతో ఆదర్శమని కొనియాడారు. ఉపాధ్యాయ వృత్తిలో 41 సంవత్సరాలు విద్యార్థులను తీర్చిదిద్దేందుకు అహర్నిశలు కృషి చేశారన్నారు. సబ్జెక్టు టీచర్‌ను నియమించే వరకు విద్యార్థులకు ఉచితంగా విద్య బోధన చేస్తాననడం అభినందనీయం అన్నారు. అనంతరం మహబూబ్‌చాంద్, డీఈఓ మీనాక్షిలను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

లింగాల : ఫెంగల్ తుఫాన్‌తో రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ అధికారి రమేష్ తెలిపారు. ముఖ్యంగా పొలాల్లో నీరు నిలువ ఉండకుండా కాపాడు కోవాలన్నారు. కాలువలు ఏర్పాటు చేసుకుని నీటిని బయటికి వెళ్లేలా చూసుకోవాలన్నారు. వరి పంటలు సాగు చేసిన పార్నపల్లె గ్రామ రైతులు తుఫాన్ తీవ్రతను దృష్టిలో పెట్టుకుని పంటలు కోయాల్సి వస్తే వాయిదా వేసుకోవాలన్నారు. పంటలు కోసి ఉంటే ధాన్యం తడవ కుండా భద్రపరుచుకోవాలన్నారు. ఒక వేళ ధాన్యం తడిసి ఉంటే మొలకలు రాకుండా ఉప్పు ద్రావణాన్ని పిచికారి చేసుకోవాలన్నారు. రైతులు ఎప్పటికప్పుడు వ్యవసాయ అధికారులు సూచనలు పాటించాలన్నారు.

క్రీస్తు మార్గం అనుసరణీయం


క్యాండిలేట్ సర్వీస్ ఆరాధనలో మాట్లాడుతున్న చర్చీ ఫాస్టర్ సాల్మన్‌బాబు

కమలాపురం : క్రీస్తు మార్గం అనుసరణీయం అని సీఎస్ఐ చర్చీ ఫాస్టర్ రెవ.యు.సాల్మన్‌బాబు తెలిపారు. ఆదివారం స్థానిక సీఎస్ఐ చర్చిలో క్యాండిలేట్ సర్వీస్ ఆరాధన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్యాండిల్స్ ద్వారా దేవుని వెలుగును ప్రతి ఇంటికి తీసుకెళ్లారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పేద ప్రజలకు సాయం అందించాలన్నారు. క్యాండిలేట్ సర్వీస్ ద్వారా ప్రతి ఇంటికి దేవుని వెలుగు చేరుతుందన్నారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

గంగమ్మతల్లికి ఘనంగా పూజలు



చింతకొమ్మదిన్నె : మండలంలోని కొత్తపేట సమీపంలోని గంగమ్మతల్లి దర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి ఆదివారం భక్తులు వచ్చి పూజలు చేశారు. ఆదివారం అమ్మవారిని అలంకరణ చేశారు. భక్తులు కానుకలు సమర్పించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. అలాగే ఆలయ ఆవరణలోని ఆంజనేయస్వామి, శివాలయం, వీరభద్ర స్వామి ఆలయాలలో భక్తులకు పూజలు చేశారు.

తెలుగు భాషాభివృద్ధికి బ్రౌన్ సేవలు అపూర్వం



శ్రీనివాస్ దంపతులను సత్కరిస్తున్న జానమద్ది విజయభాస్కర్

కడప కల్చరల్: తెలుగు భాష ఉద్ధరణకు బ్రౌన్ చేసిన కృషి అపూర్వమని ప్రవచన కారుడు నండూరి శ్రీనివాస్ అన్నారు. నగరంలోని చార్లెస్ ఫిలిప్ గ్రంథాలయాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు భాషాభిమానులు బ్రౌన్‌ను మరువలేరని, ఆయన పేరిట గొప్ప గ్రంథాలయాన్ని నిర్మించడం ప్రశంసనీయమన్నారు. తొలి తెలుగు ఆంగ్ల నిఘంటువు రూపొందించి తాళపత్రాలలో నిక్షిప్తమైన సాహితీ సంపదను వెలికి తీసిన కారణ జన్ముడు బ్రౌన్ అన్నారు. బ్రౌన్ గ్రంథాలయాన్ని దర్శించనీయ స్థలంగా ప్రకటించి ఆయన జయంతి, వర్ధంతి నిర్వహించాలని కోరారు. అనంతరం శ్రీనివాస్ దంపతులను జానమద్ది విజయభాస్కర్, విజయలక్ష్మి దంపతులు ఘనంగా సత్కరించారు. బ్రౌన్ గ్రంథాలయ ప్రచురణల గౌరవ సభ్యత్వ పత్రాన్ని సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో రమేష్‌రావు, హరిభూషణ్, రమణి, నీలకంఠ, రాణి పాల్గొన్నారు.

బిట్స్ బుక్‌లెట్స్‌తో ఉత్తీర్ణత సులభతరం

కడప ఎడ్యుకేషన్: డిపార్ట్‌మెంట్ పరీక్షల ఉత్తీర్ణతకు బిట్స్ బుక్‌లెట్స్ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని వక్తలు పేర్కొన్నారు. కడప ఎన్‌జీవో భవన్‌లో డిపార్టుమెంటల్ పరీక్షల బిట్స్ బుక్‌లెట్‌ను ఆదివారం విడుదల చేశారు. జేఏసీ చైర్మెన్ శ్రీనివాసులు మాట్లాడుతూ మెటీరియల్‌లోని మోడల్ పేపర్లు పరిశీలించి సులభంగా పరీక్ష రాసేందుకు వీలుంటుందన్నారు. ఏపీ ఎన్జీవో జిల్లా కార్యదర్శి రవికుమార్ మాట్లాడుతూ డిపార్టుమెంట్ పరీక్షలు దిశా నిర్దేశం చేసే విధంగా బుక్‌లెట్ రూపొందిందని, వాటి ద్వారా సాధన చేస్తే ఉద్యోగులు పరీక్షల్లో విజయం సాధిస్తారన్నారు. ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు సీవీ.ప్రసాద్ మాట్లాడుతూ సర్వీసు నిబంధనలపై అవగాహన పెంచుకొనేలా బుక్‌లెట్ తయారు చేశామన్నారు. అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమాకాంత్‌లు పాల్గొన్నారు.

గుంతలమయంగా గ్రామీణ రహదారులు


రాళ్ళు తేలిన నల్లబల్లె-రాజుల గురువాయిపల్లె గ్రామీణ రహదారి


అధ్వానంగా వున్న నల్లబల్లె రహదారి


గుంతలతో ప్రమాదకరంగా వున్న బొందలకుంట రహదారి

ముద్దనూరు : మండలంలోని కొన్ని రహదారులు రాళ్ళు తేలి ప్రయాణానికి ప్రమాదకరంగా తయారయ్యాయి. మరి కొన్ని చోట్ల రహదారులు గుంతలమయంగా మారడంతో గ్రామీణ ప్రజలు రవాణాలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ప్రధానంగా మండలంలోని ముద్దనూరు-నల్లబల్లె రహదారి తా రులేచిపోయి గుంతలమయంగా మారింది. నల్లబల్లె నుంచి రాజుల గురువాయిపల్లె వరకు 3 కి. మీ.పైగా ప్రధాన రహదారి మొత్తం తారులేచిపో యి రాళ్ళమయంగా మారింది. కనీసం ద్విచక్ర వా హనాలలో కూడా ప్రయాణించ డానికి అనువుగా లే కపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందిపడుతున్నా రు. వీటితో పాటు బొందలకుంట రహదారి గుంతలమయంగా మారడం, బొందలకుంట నుంచి బడుగువారిపల్లె రహదారి అధ్వానంగా మారింది. ఈ రహదారి కూడా రాళ్ళమయంగా తయారైంది. నిత్యం గ్రామాలకు రాకపోకలు సాగించే ప్రజలు అ వస్థలు పడుతున్నారు. పూర్తిగా దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు చేయాలని సంబంధిత అధికారులను గ్రామస్తులు కోరుతున్నారు.